అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- మంచిర్యాల డీఆర్డీవో కిషన్

ముదిగుంట పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

జైపూర్, మే 31 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, పూర్తి చేయాలని మంచిర్యాల డీఆర్డీవో కిషన్ అన్నారు. మండలంలోని ఇందారం, కుందారం, గంగిపెల్లి, ముదిగుంట, రామారావుపేట గ్రామాల్లో గల పాఠశాలల్లో అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పాఠశాల ఆరంభం నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందజేసే స్కూల్ యూనిఫామ్స్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. అలాగే స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టిస్తున్న యూనిఫామ్స్‌ను ఆయా కుట్టు మిషన్ కేంద్రాలకు వెళ్లి, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీఎం రాజ్‌కుమార్‌తో పాటు వివిధ గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో మరమ్మతులు పూర్తి చేయాలి

మాట్లాడుతున్న పీవో ఖుష్బు గుప్తా

- ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా

ఉట్నూర్, మే 31 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలని పీవో ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవన్‌లో ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమశాఖ అధికారులు, ఏటీడబ్ల్యూవోలు, ఏసీఎంవోలు, జీసీడీవోలు, క్రీడాధికారులు, పీఎంఆర్సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ విద్యార్థులను ఆశ్రమాల్లో చేర్పించడంపై అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులను ఇంటర్‌లో చేర్పించేందుకు కసరత్తు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీడీలు దిలీప్ కుమార్, రమాదేవి, గంగారాం, ఈఈ భీంరావు, జీసీసీ డీఎం రమానందం, అదనపు ఏజెన్సీ వైద్యాధికారి మనోహర్, ఎస్‌డీసీ గంగాధర్, ఏసీఎంవోలు జగన్, ఉద్దవ్, రాజమౌళి, శివాజీ, క్రీడాధికారి పార్థసారథి, మీనారెడ్డి, జీసీడీవో ఛాయాదేవి, శకుంతల, జీవరత్నం ఉన్నారు.

సులువైన పద్ధతిలో విద్యను నేర్పించాలి

విద్యార్థులకు సులువైన పద్ధతిలో విద్యను నేర్పించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా సూచించారు. శుక్రవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో భారత్ దేశో స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో వికాసం పాఠశాలలో నిర్వహించిన పిల్లల సందడి వేసవి శిబిరాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఆట, పాటలతో నేర్పిన విద్యను విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోలేరని తెలిపారు. విద్యతో పాటు డ్రాయింగ్ నేర్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. నీతి అయోగ్ సీపీవో రాహుల్, పీఎంఆర్సీ, ఆర్పీఎం గోవిందర్‌రావు, వికాసం ప్రిన్సిపాల్ వికాస్, భారత్ దేశో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

స్టాల్స్ కోసం దరఖాస్తు చేసుకోండి

రెబ్బెన, మే 31 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్ సీఈఆర్ క్లబ్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తి గల వారు శనివారం సాయంత్రం వరకు గోలేటి జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 99512 14116 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వేడుకలకు సర్వం సిద్ధం..

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సీఈఆర్ క్లబ్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 2వ తేదీన ఉదయం జీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరణ, జీఎం రవిప్రసాద్ ప్రసంగం, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేయడం, సీఈఆర్ క్లబ్‌లో జెండా ఆవిష్కరణ ఉంటుందని వివరించింది. అక్కడి నుంచి బస్టాండ్ మీదుగా కార్మిక కాలనీల్లో తెలంగాణ రన్ ఉంటుందన్ని పేర్కొన్నది. సాయంత్రం 6:30 గంటల నుంచి సీఈఆర్ క్లబ్‌లో జ్యోతి ప్రజ్వలన నిర్వహించి, ముఖ్య అతిథుల ప్రసంగాలు, ఉత్తమ ఉద్యోగులు, సేవా సభ్యులు, ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాని వెల్లడించింది. ఉద్యోగులు, వారి కుటుంబాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

మనుమరాలే సూత్రధారి

వేసవి సెలవులకు వచ్చి అమ్మమ్మ ఇంట్లో చోరీ

- నగదు, బంగారం అపహరించి ప్రియుడికి అప్పగించిన యువతి
- మూడు రోజుల్లోనే కేసును చేదించిన పోలీసులు

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీసీసీ ఎస్ఐ రవికుమార్(ఫైల్)

సీసీసీ నస్పూర్, మే 31: వేసవి సెలవులకు అమ్మమ్మ–తాతయ్య ఇంటికి వచ్చిన ఓ యువతి డబ్బులు, బంగారం అపహరించి తన ప్రియుడికి అప్పగించగా, పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కేసును చేదించారు. మనుమరాలే చోరీ చేసిందని తేల్చి.. ఆమెతో పాటు ప్రియుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. గుమ్మడి సత్తయ్య–శశిరేఖ దంపతులు నస్పూర్ నాగార్జునకాలనీలో నివాసముంటున్నారు. సత్తయ్య సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 27న మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో సత్తయ్య భార్య ఎప్పటిలాగే సమీపంలోని గ్రౌండ్‌కు వాకింగ్‌కు వెళ్లి 6 గంటలకు తిరిగి వచ్చింది. ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. వారు ఘటనా స్థలానికి చేరుకొని పలు కోణాల్లో విచారణ చేపట్టారు.

వేసవి సెలవులకు వచ్చి.. ప్రియుడికి నగదు, బంగారం అప్పగించి..

హైదరాబాద్‌లో చదువుకుంటున్న ఓ యువతి వేసవి సెలవులు రావడంతో తన అమ్మమ్మ–తాతయ్య(సత్తయ్య– శశిరేఖ) ఇంటికి వచ్చింది. అంతకుముందే సదరు యువతికి హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడితో సోషల్ మీడియాలో పరిచయం ఏర్పడింది. క్రమంగా అది ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాతయ్య ఇంట్లో ఉన్న బంగారం, నగదు చూసి కాజేయడానికి ప్రియుడితో కలసి ప్లాన్ చేసింది. పథకం ప్రకారం యువకుడు హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చాడు. ఈ నెల 27న తాతయ్య డ్యూటీకి వెళ్లడం, సాయంత్రం అమ్మమ్మ వాకింగ్‌కు పోవడంతో తన ప్రియుడికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ప్రియుడు గోడ దూకి ఇంట్లోకి వచ్చాడు. బీరువాలోని రూ.4.5 లక్షలు, సుమారు 15 తులాల బంగారం, 30 తులాల వెండి ప్రియుడికి ఇచ్చింది. ఈ మొత్తం బ్యాగులో పెట్టుకున్న ప్రియుడు మళ్లీ గోడ దూకి వెళ్లిపోయాడు. అనంతరం ఆమె ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లింది. వాకింగ్ నుంచి వచ్చిన అమ్మమ్మతో కలిసి ఇంట్లోకి వచ్చింది. ఆపై చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

ప్రత్యేక బృందాలతో విచారణ..

రామగుండం సీపీ ఆదేశాల మేరకు పోలీసులు పలు కోణాల్లో విచారణ జరిపారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ సిబ్బందితో వివరాలు సేకరించారు. డీసీపీ, ఏసీపీల పర్యవేక్షణలో సీఐ ఆకుల అశోక్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. చివరికి వీరి మనుమరాలిపై అనుమానం వచ్చి దర్యాప్తు చేయడంతో చోరీ బాగోతం బయటపడింది.. సాంకేతిక పరిజ్ఞానంతో ఆమె ప్రియుడిని హైదరాబాద్‌లో పట్టుకున్నారు. వారి నుంచి రూ. 4.25లక్షలు, 15 తులాల బంగారం, 30తులాల వెండి, పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు శుక్రవారం వీరిని రిమాండ్‌కు తరలించారు. కేసును మూడు రోజుల్లోనే ఛేదించిన సీఐ ఆకుల అశోక్, ఎస్ఐలు రవికుమార్, జితేందర్ సింగ్, క్రైం టీం సభ్యులు ఇజాజ్, నరేందర్, సీసీఎస్ టీం సభ్యులు సతీశ్, శ్రీనివాస్‌ను రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీలు అభినందించారు.

ఉత్పత్తి, ఉత్పాదకతకు కృషిచేయాలి

- తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపుకోవాలి
- శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి
- ఉత్పత్తి, వేడుకల నిర్వహణపై మేనేజర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, మే 31 : రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతకు అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషిచేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సూచించారు. జీఎం ఆఫీస్‌లో శుక్రవారం ఏరియా ఉన్నతాధికారులు, మేనేజర్లతో ఉత్పత్తి, తెలంగాణా ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. గనులు, ఓసీపీల్లో ప్రమాదాలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఉత్పత్తి పెంచే క్రమంలో అధికారులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రతీ ఉద్యోగి కృషిచేయాలన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జూన్ 2న ప్రగతి స్టేడియంలో ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి కార్మికుడు, వారి కుటుంబ సభ్యులు పాల్గొనాలని కోరారు. ఉదయం 8 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, సాయంత్రం 6 గంటలకు ప్రగతి స్టేడియంలో ముగింపు వేడుకలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఇందారం ఓసీపీ పీవో శ్రీనివాస్, ఏరియా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్ గోపాల్‌సింగ్, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో టీ శ్రీనివాస్, డీవైజీఎంలు చిరంజీవులు, అరవిందరావు, డీవైసీఎంవో రమేశ్‌బాబు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, సర్వే ఆఫీసర్ వెంకటేశం, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ అమర్‌నాథ్, ఎస్టేట్ ఆఫీసర్ వరలక్ష్మి, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, అన్ని గనుల మేనేజర్లు పాల్గొన్నారు.